
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

APRIL 2007

సంవత్సర చందా రూ. 50/-

# Declaration (See Rule 3)

| | | |
|---|---|---|
| Title of The News Paper | : | **SATYA VAKKU** |
| Language | : | Telugu |
| Name & Address of the Publisher | : | Joshua Gootam<br>10-4-33/1,S.G.Rao St.<br>Kakinada - 533 004 |
| Nationality | : | Indian |
| Name of the Printer with address | : | Joshua Gootam<br>10-4-33/1,S.G.Rao St<br>Kakinada - 533 004 |
| Place of Printing with address | : | Satyavani<br>Church of Christ, 7-9-35<br>Sambamurthi St.<br>Kakinada - 533 001 |
| Place of Publishing | : | Satyavani<br>Church of Christ, 7-9-35<br>Sambamurthi St.,<br>Kakinada - 533 001 |
| Name of the Editor | : | Joshua Gootam (Indian)<br>10-4-33/1, Seshagirirao St,<br>Kakinada - 533 044. |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper above are true to the best of my knowledge and belief.

Sd/-

**Joshua Gootam**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722



Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | ఏప్రియల్ 2007 | సంచిక 9


## పరలోకమందున్న దేవుడు

(The God in Heaven)

బబులోను సామ్రాజ్యాధిపతి యగు నెబుకద్నెజరు తన యేలుబడియందు కలలు కనెను. తాను కనిన కలలను తనకు తెలియజెప్పుటకై రాజు తన సముఖమునకు శకునగాండ్రను, గారిడీ విద్య గలవారిని, మాంత్రికులను, కల్దీయులను పిలువ నంపించెను గాని వారెవరును రాజు కనిన కలలను, వాటి భావమును తెలియజెప్పలేకపోయిరి. అయితే రాజునకు భావము తెలియ జెప్పగల దానియేలు అనునొక మనుష్యుడు బబులోను చెరలోయున్న యూదులలో ఒకడుండెను. అతడు రాజు సన్నిధికి కొనిపోబడెను. "రాజు–నేను చూచిన కలయు దాని భావమును తెలియజెప్పుట నీకు శక్యమా! అని బెల్తెషాజరు అను దానియేలును అడుగగా దానియేలు రాజు సముఖములో ఈలాగు ప్రత్యుత్తర మిచ్చెను–రాజడిగిన యీ మర్మము జ్ఞానులైనను, గారడీవిద్యగల వారైనను, శకునగాండ్రయినను, జ్యోతిష్కుల

యినను తెలియజెప్పజాలరు. అయితే మర్మములను బయలుపరచగల దేవుడొకడు పరలోకమందున్నాడు, అంత్యదినముల యందు కలుగబోవు దానిని ఆయన రాజగు నెబుకద్నెజరునకు తెలియజేసెను'' అని చెప్పి పరలోకమందున్న దేవుడే నిజమైన దేవుడని నిరూపించుచు దానియేలు రాజు కనిన కలలను, దాని భావమును సంపూర్తిగా విడమర్చి చెప్పెను. "అంతట రాజగు నెబుకద్నెజరు దానియేలునకు సాష్టాంగ నమస్కారము చేసి, అతని పూజించి నైవేద్య ధూపములు అతనికి సమర్పింప ఆజ్ఞాపించెను. మరియు రాజు-ఈ మర్మమును బయలుపరచుటకు నీవు సమర్థుడవైతివే; నీ దేవుడు దేవతలకు దేవుడును, రాజులకు ప్రభువును, మర్మములను బయలుపరచువాడునై యున్నాడని దానియేలునకు ప్రత్యుత్తరమిచ్చెను. అప్పుడు రాజు దానియేలును బహుగా హెచ్చించి అనేక గొప్పదానము లిచ్చి అతనిని బబులోను సంస్థానమంతటి మీద నియమించెను" (దాని 2:46-46).

దానియేలు సేవించు దేవుడే నిజమైన దేవుడని రాజగు నెబుకద్నెజరు మహదానందముతో అంగీకరించెను. పరలోక మందున్న నిజదేవుని శక్తిని, జ్ఞానమును అతడు గ్రహించి ఆయన యందు విశ్వసించుటకు మొదలిడెను.

బైబిలు గ్రంధము దేవుని ఉనికిని గొప్ప వాస్తవముగా మనకు ప్రబోధించుచున్నది. కాని దేవుడున్నాడని నిరూపించుటకు అది ప్రయత్నించుట లేదు. అందువలన బైబిలులోని మొదటి వచనమే "అది యందు దేవుడు" అనే పదములతో ఆరంభమగుచున్నది. దానియేలు కూడ నెబుకద్నెజరు యెదుట నిలబడి 'దేవుడొకడు వరలోక మందున్నాడు' అని ధైర్యముగ పలికెను.

పరలోక మందున్న దేవుని గూర్చి ప్రజలలో పలు రకములైన అభిప్రాయములు లేకపోలేదు. ఆయన మనుష్యుని వలెనే యున్నాడు గాని మానవునికంటె గంభీరుడని కొందరి యభిప్రాయము. ఆయన మూర్తిత్వము, వ్యక్తిత్వము లేనివాడని, ఆయన సహజముగా అన్నిచోట్ల యున్నవాడని అయితే ప్రత్యేకముగా ఏ ఒక్కచోట యుండువాడు కాదని మరికొందరి అభిప్రాయము. మరి ఇంకా కొందరయితే దేవుడు, ప్రకృతి-ఈ రెండు ఒకటే యని తలంతురు. మానవులలో ఈనాడు కూడ ఇట్టి అభిప్రాయములుండుటచే దేవుని యొక్క తత్వమును

లేక ఆయన సహజ లక్షణములను తెలిసికొనుట అతి ప్రాముఖ్యమై యున్నది. దైవ లక్షణములను మనము గ్రహించిన తరువాత ఆయన ఉనికి యొక్క సాదృశ్యములను తెలియ జెప్పుట ఏమంత కష్టము కాదని నాయభిప్రాయము. మనకు తెలియ బడని దేవునియందు మనము విశ్వాస మెట్లు ఉంచగలము? ఉంచలేము గదా? అందువల్లనే దేవుడు తున్న తాను మనకు బయలుపరచు కొనవలసి వచ్చెను. ఒకే ఒక్క నిజ దేవుడైన యెహోవా తన గ్రంథమందు ఇట్లు మనకు పరిచయము చేసికొనుచున్నాడు: "నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు. నేను తప్ప ఏ దేవుడును లేడు. తూర్పు దిక్కు నుండి పడమటి దిక్కు వరకు నేను తప్ప ఏ దేవుడును లేడని జనులు తెలిసికొనునట్లు నీవు నన్ను ఎరుగ కుండి నప్పటికిని నిన్ను సిద్ధపరచితిని. యెహోవాను నేనే, నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెష 45:5,6). యెషయా 44:6లో "నేను మొదటి వాడను, కడపటివాడను, నేను తప్ప ఏ దేవుడును లేడు" అని ఆయన పలుకుచున్నాడు. "నేను తప్ప వేరొక దేవుడున్నాడా?..... ఉన్నట్టు నేనెరుగను" అని 8వ వచనములో ఆయన పలుకుచున్నాడు. "నీ దేవుడైన యెహోవాను నేనే.... నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని, క్రింద భూమి యందేగాని, భూమిక్రింద నీళ్ళయందే గాని యుండు దేని రూపమునయినను, విగ్రహమునయినను నీవు చేసికొన కూడదు; వాటికి సాగిల పడకూడదు, వాటిని పూజింపకూడదు" అని నిర్గమ 20:24లో ఆయన చెప్పుచున్నాడు. గనుక ఒకే ఒక్కడై యున్న ఈ నిజదేవుని తెలిసికొనుట ఎంతో ప్రాముఖ్యమై యున్నది.

దేవుని నిజలక్షణములను పరిశోధించి తెలిసికొనుటకు మనము మొదలిడిన యెడల దానికి అంతు ఉండదు అని కొందరు నమ్ముదురు. కొంత మట్టుకు ఈ మాట సరియైనదే. ఏలయనగా దేవుడెరిగినదంతయును మానవుడు ఎరుగజాలడు. అట్లయిన దేవుని యంతటి జ్ఞానమును మానవుడే కలిగి యుండును. అయితే దేవుడు అమితమయినవాడు. మానవుడు

మితము చేయబడినవాడు. "దేవుడు భీకరమైన మహిమను ధరించుకొని యున్నాడు. సర్వశక్తుడగు దేవుడు మహోత్త్యముగలవాడు. ఆయన మనకు అగోచరుడు" అని యోబు 37:22-23లో వ్రాయబడి యున్నది. తనను గూర్చి యున్న సంగతులన్నిటిని దేవుడు మానవులకు బయలు పరచలేదు. ఆయన బయలు పరచకుండా యున్న సంగతులు అనేకములు కలవు. ఆయన క్రియలన్నిటిని గూర్చి కూడ ఆయన మనకు బయలు పరచి యుండలేదు. అందువలన దైవత్వాన్ని మనము పరిశోధించునపుడు మనము సాధించలేని అనేక సమస్యలను ఎదుర్కొనుట సహజమే. అందుకే "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మ శాస్త్ర వాక్యములన్నిటి ననుసరించి నడుచుకొనునట్లు బయలు పరచబడినవి యెల్లప్పుడు మనవియు, మన సంతతి వారివియు నగునని" మోషే బైబిలునందు లిఖించెను (ద్వితీ 29:29).

యోబు గ్రంథము 38,39 అధ్యాయములలో భక్తుడైన యోబునకు దేవుడు కొన్ని ప్రశ్నలు వేసెను. దేవుని నిగూఢ రహస్యములలో కొన్నిటిని మాత్రమే అక్కడ దేవుడు ఎత్తిచూపెను. వాటిలో దేనికిని యోబు జవాబీయ లేకపోయెను. విజ్ఞాన శాస్త్రము ప్రబలి యున్న నేటి దినములలో కూడ వాటికి మానవులు సరియైన జవాబు నీయలేని పరిస్థితిలో యున్నారు.

రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును అని చెప్పుచున్న వాక్యమే, బయలుపరచబడినవి యెల్లప్పుడు మనవియు, మన సంతతి వారివియునని చెప్పుచున్నది. దేవుడు మానవునికి తన్నుతాను అనేక రీతులుగ బయలు పరచుకొనెను. దేవుని గూర్చి మానవుడు తెలిసికొనుటకు అనేక సంగతులు కలవు. ప్రకృతిద్వారాను, ఆయన చేతిపని ద్వారాను దేవుడు తన్ను తాను బయలుపరుచుకొనెను. అందుకే "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది" యని దావీదు మహారాజు వ్రాసెను (కీర్త 19:1-2).

"ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది; దేవుడే అది వారికి విశదపరచెను. అయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటబడుచున్నవి" యని రోమా 1:19,20లో అపో.పౌలు వ్రాసెను.

దేవుని లక్షణములను, ఆయన తత్వమును మనము గ్రహించుకొనుట ఏమంత కష్టముకాదు. బైబిలు అను పరిశుద్ధ గ్రంథమందు ఆయన తన్ను తాను మనకొరకు ప్రత్యేకముగా బయలుపరచుకొనెను. నిజానికి దేవుని గూర్చిన అనుభవజ్ఞానము మనము పొందు నిమిత్తము దేవుడు తన పరిశుద్ధ ఆత్మ ద్వారా బైబిలును లిఖించి మనకిచ్చెను. యేసు క్రీస్తు ద్వారా పరలోకమందున్న దేవుడు మరింత వ్యక్తిగతముగా తన్నుతాను బయలు పరచుకొనెను. "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చి నీ మర్మము గొప్పదై యున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పు నొందెను. దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. లోకమందు నమ్మబడెను, ఆరోహణుడై తేజోమయుడయ్యెను" (1 తిమో 3:16). దేవుడు లోకమును తనలో క్రీస్తునందు సమాధాన పరచుకొన నిమిత్తము యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను (2 కొరింథీ 5:19). నన్ను చూచినవాడు తండ్రియైన దేవుని చూచి యున్నాడని యేసు ప్రకటించెను (యోహా 14:9). ఇంకొక మాటలో నేనే దేవుడనని యేసు ప్రకటించెను. నేనే ఆయనని మీరు విశ్వసింపని యెడల మీరు మీపాపములలోనే యుండి చనిపోవుదురని యేసు చెప్పెను (యెహోను 8:24). మన పాపములోనే మనము మరణించిన యెడల నరకము తథ్యము. అట్లుగాక మనము యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు నొంది, క్రీస్తును ఒప్పుకొనుచు ఆయన నామములోనికి బాప్తిస్మము పొందిన యెడల మనము నరకము నుండి రక్షించబడుదుము.

-జాషువా గూటం

# సంఘ ఐక్యత

## (Unity of the Church)

సంఘం ఐక్యత కొరకు నేటి క్రైస్తవలోకము ముందెన్నడు లేనంత గట్టిగా పనిచేయుచున్నది. ప్రతి మానవుడు దీనినెరిగే యున్నాడు. ఏలయనగా ఈలోకము అంతా మతశాఖలతో నిండియున్నది. అందరూ ఈ విభజనలను బట్టి విసిగి పోయి ఉన్నారు. అయితే మానవ కల్పిత శాఖలలో ఐక్యత నెలకొల్పుట అసాధ్యము. ఏలయనగా లోక మందంతటా మానవులు విభజనలు కలిగియుండుటకు ఏకమై యున్నట్లున్నారు! ఈ శాఖలలో ఒక రకమైన ఏకత్వము ఒకవేళ సంభవించినను విభేధములుండకమానవు. గనుక దానికి విరుగుడు యేమి? దాని విరుగుడు బైబిలునందే యున్నది. నిజమైన ఐక్యత నెలకొల్పబడు నిమిత్తము మనుష్యులు వారి సొంత బోధనలను, సిద్ధాంతములను, నామములను, సంఘములను, ప్రమాణ పుస్తకములను పరిత్యజించ వలయును. వారు బైబిలును పరిగ్రహించి, పఠించి, దానిని విశ్వసించి, విధేయత చూపవలెను. అప్పుడు మాత్రమే సరియైన ఐక్యత, యేసు ప్రభువు యోహాను 17లో ప్రార్థించిన యట్టి ఐక్యత సాధ్యమగును. మానవులిట్లు చేయునప్పుడు వారందరు ఒకే విశ్వాసమును కలిగియుందురు, ఒకే బోధకు లోబడుదురు, ఒకే నామమును ధరించుకొందురు. అందరు కలసి పనిచేయుదురు, ఒకే బోధను బోధింతురు, అందరు కలసి పరలోకమునకు వెళ్లుదురు. మానవుడు మరియొక మానివుని వెంబడించుట మాని క్రీస్తుని వెంబడించుటకు మొదలిడిన యెడల అతి సులభముగ ఐక్యత నెలకొల్పబడును.

లేఖనములు విభజనను ఖండించు చున్నవి. సహోదరులలో జగడములు, విభజనము పుట్టించువానిని దేవుడు అసహ్యించుకొనునని బైబిలు చెప్పు చున్నది (సామెతలు 6:19). 1 కొరింధి మొదటి అధ్యాయములో కొరింధులో నున్న సంఘము విభజింపబడి యుండుట మనకు కన్పబడును. ఇట్టి దానిని చూచి హర్షించుటకంటె దానిని

సమూలాగ్రముగ నాశనము చేయుటకు అపొస్తలుడైన పౌలు అతి త్వరితముగ పూనుకొనెను. అతడిట్లారంభించెను: ‘‘సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడ వలెననియు, మీలో కక్షలులేక యేక మనస్సుతోను, ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొను చున్నాను" (1కొరింథీ 1:10). వారు చేసిన పనిలోని అసంగతములు వారికి కన్పడు రీతిగ మూడు ప్రశ్నల నతడు వారి నడిగెను. అవేవన: క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీకొరకు సిలువేయ బడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా? ఈ మూడింటికి అట్లుకాదు అని వారు జవాబియ్యవలసి వచ్చెను. గనుక విభజింపబడిన స్థితిలో యున్న వారి బుద్ధిహీనతను అతడు వారికి బయలుపరచెను.

అదే అపొస్తలుడైన పౌలు రోమాలో యున్న సహోదరులకిట్లు వ్రాసెను: "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగచేయువారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటల వలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17;18). కొలస్స 2:20-22లో అతడిట్లు చెప్పెను: "మీరు క్రీస్తుతో కూడ లోకము యొక్క మూలపాఠముల విషయమై మృతి పొందిన వారైతే లోకములో బ్రతుకు చున్నట్లుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి - చేతపట్టు కొనవద్దు, రుచి చూడవద్దు, ముట్టవద్దు అనువిధులకు మీరు లోబడనేల? అవన్నియు వాడుకొనుట చేత నశించిపోవును".

దీని అంతటి భావమేమనగా మానవుల పద్ధతులు, ఆజ్ఞలు, బోధలు మానవులకే ఘనత నిచ్చును, బైబిలుకు వేరుగాయున్న గ్రంథముల ననుసరింపజేయుచు విభజనలను కల్పించును. అది అట్లుండగా క్రీస్తును వెంబడించుట ద్వారా ఐక్యతను సాధించి అనుభవించ వచ్చును. క్రీస్తు ఇట్లు ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు

నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాస ముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను'' (యోహాను 17:20,21). అసాధ్యమైన దానికొరకు క్రీస్తు ప్రార్థించెనా? లేదు. గనుక ఐక్యత సాధించుట తప్పక సాధ్యమే. అయితే ఎప్పుడు? మనము క్రీస్తును మాత్రమే వెంబడించినప్పుడు. మానవ కల్పిత సిద్ధాంతములు మనలను విభజించును గాని బైబిలు బోధలు మనలను ఐక్యపరచును.

ఎఫెసీ 4:1-4లో ఐక్యతను సాధించుట కొరకు సూత్రము మనకున్నది. దానిని ఇప్పుడు వినుము: ''కాబట్టి మీరు సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట యందు శ్రద్ధకలిగినవారై ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికము తోను నడుచుకొనవలెనని ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను. శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు''. ఇది ఐక్యత కొరకొక విన్నపము అని గమనించుము. చెప్పబడినవన్నియును ఒక్కొక్కటే యున్నదని కూడ గమనించుము. ఒక్కటికంటె ఎక్కువ యున్నవని తలంచగలవారెవరు?

సంఘ ఐక్యత క్రీస్తు పలుకులలోనే ఇమిడి యున్నది. నాసంఘమును నేను కట్టుదును అని ఆయన చెప్పిన మాటలలో ఏకత్వమున్నది (మత్తయి 16:18). అది ఆయన ఆత్మీయ శరీరమైయున్నది (1 కొరింథి 12:27), దానికి ఆయన శిరస్సై యున్నాడు (కొలస్స 1:18). క్రీస్తుకు రెండు శరీరములు, రెండు తలలు ఉన్నవని ఎవడును ఆరోపించలేడు గదా. సంఘము దేవుని గృహమని, ఆయన కుటుంబమని కూడ వివరించబడినది (1 తిమోతి 3:15). అయితే ఎన్ని

గృహములు లేక కుటుంబములు దేవునికి ఉన్నవి? ఒక్కటి మాత్రమేగదా! క్రీస్తు రాజై యుండగా క్రీస్తు రాజ్యమును గూర్చియు లేదా దేవుని రాజ్యమును గూర్చియు మనము చదువగలము (యోహాను 3:3-5; కొలస్స 4:11; 1తిమో 6:15). దేవునికి ఎన్ని రాజ్యములున్నవి? రాజు లెంతమంది? ఈరెండు సందర్భములలోను ఉన్నది ఒక్కటి మాత్రమే.

ఇంకా అనేక సంగతులు మనము చెప్పుకొనవచ్చును. డినామినేషన్లను, తద్వారా వచ్చిన విభజనలను బైబిలు తప్పక ద్వేషించుచున్నది. వ్యతిరేకించుచున్నది. సరిగదా అది ఐక్యతను ఏకత్వమును, పరిపూర్ణతను, పరిశుద్ధతను వర్ణించుచున్నది. సంఘమనగా వివిధ విశ్వాసములతోను, ఆచారములతోను నిండియున్న సంస్థయని బైబిలు వర్ణించుట లేదుగాని, అది క్రీస్తుకు చెందినదని, పిలువబడిన వారిచే అది సమకూర్చ బడినదని, క్రీస్తును వెంబడించి ఆయన బోధకులోబడి రక్షించబడినవారితో అది నిండి యున్నదని వర్ణించుచున్నది. క్రీస్తు విభజింపబడలేదు. ఆయన సంఘము కూడ విభజింపబడలేదు. విభజింపబడి యుండి, విభాగములను సమర్ధించుట యేసు క్రీస్తును, ఆయన చేసి ప్రార్ధనను వ్యతిరేకించుటయగును.

**జె. సి. ఛోట్**


**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి.**

**ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

# దేవుని యొక్క సింహాసనము

(The Throne of God)

**పరిచయము:** ప్రకటన 4వ అధ్యాయము పూర్తిగా చదువుము.

మొదటి అధ్యాయములో మనం క్రీస్తు యొక్క చిత్రాన్ని చూస్తాము. రెండు మూడు అధ్యాయల్లో భూమిమీద సంఘముల మధ్యనున్న క్రీస్తును చూస్తాము.

1. ప్రకటన 4వ అధ్యాయపు ఆరంభములో తెరువబడియుండిన ఒక తలుపును యోహాను చూస్తాడు.

ఫిలదెల్ఫియలో నున్న సంఘమునకు ప్రభువు ద్వారము తెరిచారు (3:8). లవొదికయలోనున్న సంఘము క్రీస్తు కొరకు తమ హృదయ ద్వారమును తెరవాలని ఆయన కోరారు (3:20).

2. మొదటివచనంలో బూరధ్వని వలె యున్న ఒక స్వరాన్ని యోహాను వింటాడు. 'ఇక్కడికి ఎక్కిరమ్ము' అనుమాటను అతడు వినెను.

3. ఇకమీదట జరగబోవు సంగతులను యోహాను చూడబోవుచున్నాడు. ఆత్మవశుడై యుండగా అతడు వాటిని చూచును. ప్రభువు దినమందు అతడు ఆత్మవశుడై యుండెను (1:10).

## I. దేవుని సింహాసనము, అందు ఆసీనుడై యున్నవాడు (2,3 వ).

A. పరలోకమందు ఒక సింహాసనము వేయబడియుండుట యోహాను చూచెను. సింహాసనము అను ఈ మాట ప్రకటన గ్రంథములో 2,8,9 అధ్యాయాల్లో తప్ప ప్రతి అధ్యాయము లోను మనకు కనబడును. 4,5 అధ్యాయాల్లో అది 19 సార్లు చెప్పబడింది. 'సింహాసనము' అధికారస్థానమని యర్థము. ఇక్కడ ఈ విశ్వము యొక్క కంట్రోల్ స్థావరాన్ని మనం చూచుచున్నాము.

B. "ఆ సింహాసనమందు ఒకడు ఆసీనుడై యుండెను". ఆయన విశ్రాంతి గైకొనుటలేదు. దేవుడు పాలించుచున్నారు. ఆయనను యోహాను ఇట్లు వర్ణించుచున్నాడు!

1. ఆయన సూర్యకాంత పద్మరాగములను పోలినవాడు. యివి వజ్రములు. సూర్యకాంతరాయి మచ్చలేనిది, పవిత్రమైనది, తెల్లగా యుండి మెరయునట్టిది. అది దేవుని పరిశుద్ధతను పవిత్రతను సూచించుచున్నది.

2. పద్మరాగము (Sardine Stone) ఎర్రగా యుండును దేవుని ఉగ్రతకు సూచన.

3. ఈ రెండు ప్రశస్త వజ్రములు ప్రధాన యాజకుడు ధరించు ఏఫోదు పతకములో యుండేవి. అవి నూతన యెరూషలేము పునాదులలో కనబడును.

4. ఇంద్రధనస్సు ఆ సింహాసనమును ఆవరించి యుండెను. దేవుడు నిబంధన చేయు దేవుడని యిది తెలియజేయుచున్నది (ఆది.కా. 9). ఇంద్రధనస్సులో 7 రంగులుంటాయని గుర్తుంచుకొనుము. యిది నోవహుకాలము నాటి పాపపు ప్రజలను నాశనం చేయుదేవుని ఉగ్రతను, నోవహును రక్షించు ఆయన కనికరమును సూచించును. ఇంద్రధనస్సు మరకతము వలె ప్రకాశించుచుండెను. మరకతము (Emerald) అనగా ప్రకాశించుట అని యర్థము.

5. ఈ రీతిగా దేవుడు వెలుగుగా మనకు వర్ణించబడెను. దేవుడు వస్త్రము వలె వెలుగును కప్పుకొనియున్నట్లు కీర్తన 104:2 చెప్పుచున్నది. సమీపింపరాని తేజస్సులో ఆయన నివసించును (1తిమో 6:16).

## II. సింహాసనము చుట్టూ యున్నవారు (4వ)

A. సింహాసనము చుట్టు యున్న 24 సింహాసనములలోను 24 గురు పెద్దలుండిరి. గాని వారెవరు?

B. వారు ఇశ్రాయేలు యొక్క 12 గోత్రకర్తలును, 12 మంది అపొస్తలులునని కొందరు నమ్ముదురు. వారి పేరులు పరలోక పునాదిరాళ్ల మీదను, పరలోక గుమ్మముల మీదను చెక్కబడి యున్నవి (ప్రక 21). ఈ 24 గురు పెద్దలు పాత క్రొత్త నిబంధనల కాలములలో యున్న నీతిమంతులను

సూచించుచున్నారు. వారు ఇశ్రాయేలులోని పరిశుద్ధులను, సూచించుచున్నారు. వీరు విమోచింపబడినవారు. వీరు ప్రతియుగములోను యున్న దేవుని ప్రజలు, తామే సింహాసనాసీనులై దేవుని సింహాసనము చుట్టుయుండి దేవునితో కూడ రాజ్యము చేయుచున్నారు.

C. వారు తెల్లని వస్త్రములు ధరించుకొనిరి. జయించువానికి తెల్లని వస్త్రము ఈయబడును (ప్రక 3:5). యిది సంతోషానికి పవిత్రతకు గురుతు.

D. "ఈ పెద్దలు తమ తలల మీద సువర్ణ కిరీటములు పెట్టుకొన్నవారై కూర్చుండిరి". జయించు క్రైస్తవులకు జీవకిరీటము, నీతికిరీటము వాగ్ధానము చేయుబడెను (ప్రక 2:10, 2 తిమో 4:8). ప్రక 4:10; 14:3 కూడ చూడుము.

E. "ఈ పెద్దలు తమ తలల మీద సువర్ణ కిరీటములు పెట్టుకొన్నవారై కూర్చుండిరి", జయించు క్రైస్తవులకు జీవకిరీటము, నీతికిరీటము వాగ్ధానము చేయుబడెను (ప్రక 2:10; 2 తిమో 4:8). ప్రక 4:10; 14:3 కూడ చూడుము.

E. ఈ పెద్దలు యేమి చేయుచున్నారు?

1. వారు ఆరాధించుచుండిరి (ప్రక 5:11;11:16;14:3,7-11;19:4).

2. వారు పరిశుద్ధుల ప్రార్ధనలు అర్పించుచుండిరి (5:8).

## III. సింహాసనము నుండి బయల్వెడలు నట్టివి (5వ).

A. సింహాసనము నుండి ఉరుములు మెరుపులు, ధ్వనులు బయల్వెడలుచుండెను.

B. యిది నిర్గమ 19:16 లోని దృశ్యమును జ్ఞప్తికి తెచ్చుచున్నది. యివి దేవుని శక్తికి, ప్రభావమునకు గురుతు.

C. "సింహాసనము ఎదుట ఏడు దీపములు ప్రజ్వలించుచున్నవి. అవి దేవుని ఏడు ఆత్మలు". ఈ ఏడు ఆత్మలను గూర్చి ప్రక 1:4; 5:6; 3:1లో చదువుతాము. ఈ యేడు ఆత్మలు ఎవరు? వారు యెషయా 11:2 లో చెప్పబడిన యెహోవా ఆత్మ, పరిశుద్ధాత్ముడు!

## IV. సింహాసనము యెదుట నున్నవి (6వ).

A. "సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజువంటి సముద్ర ముండెను". సొలొమోను కట్టించిన నగరు గాజు సముద్రమువలె యుండెనట. షెబదేశపు రాణి దానిలో నడుచునప్పుడు తన వస్త్రములు పై కెత్తుకొని నడిచెనను వదంతి కలదు!

1. ప్రక 15:2లో అగ్నితో కలిసి యున్న స్ఫటికమువంటి సముద్ర మును గూర్చి చెప్పబడినది.

2. ప్రక 21:1లో పరలోకములో సముద్రము ఇకలేదని చెప్పబడి యున్నది.

## V. సింహాసనము మధ్య నున్నవి (6-9వ):

A. "సింహాసనము మధ్యను దాని చుట్టును, ముందు వెనుక కన్నులతో నిండిన నాలుగు జీవులుండెను".

1."మొదటి జీవి సింహము వంటిది, రెండవ జీవి దూడ వంటిది, మూడవ జీవి మనుష్యుని ముఖము వంటిది నాలుగవ జీవి పక్షిరాజువంటిది".

2.యెహెజ్కేలు మొదటి అధ్యాయము లోని మాటలను యెహాను ఇక్కడ వినియోగించాడు. పరలోకము తెరవబడి యెహోవా దేవుని ప్రభావ దర్శనమును అతడు చూచాడు. ప్రకటన 4లో వర్ణించబడిన నాలుగు జీవుల లాంటిని అతడు చూచాడు. ఈ జీవులు యెవరు? యెహెజ్కేలు 10:20లో అతడే ఇట్లు చెబుతాడు: "కెబారునది దగ్గర ఇశ్రాయేలు దేవుని క్రిందనాకు కనబడినజీవి యిదే; అవి కెరూబలని నేను గుర్తుపట్టితిని".

3. ఈ నాలుగు జీవులు కెరూబులు, దేవుని దూతలు. దేవుని పరిశుద్ధ దూతలు భీకరమైనవి. మొదటిది సింహము వంటిది, శక్తికి గుర్తు. రెండవది యెద్దువంటిది, బలానికి గుర్తు, మూడవది మనుష్యుని ముఖము వంటిది, సృష్టికి అంతటికి కిరీటము. నాల్గవది పక్షిరాజు వంటిది, వేగమునకు గుర్తు, దేవుని చిత్తమును జరిగించుటకు ఎల్లవేళలా సిద్ధముగా యున్న దూతలు వీరు. "పరలోకమందు నీ చిత్తము నెరవేరునట్లు భూమిమీద నెరవేరును

గాక" యని ప్రార్థించుమని యేసు ప్రభువు నేర్పారు. పరలోకంలో దేవుని చిత్తము బహువేగముగా నెరవేరును.

4. యెషయా 6:1-2 కూడ చదువుము.

5. ఈనాలుగుజీవులు రాత్రింబగళ్లు మానక సర్వాధికారియు దేవుడునగు ప్రభువు పరిశుద్ధ పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని చెప్పుచుందురు.

**VI. సింహాసనము చుట్టు జరుగుచు యుండేది (10,11వ):**

A. నిత్యము ఆరాధన జరుగుచు యుండును. 8-9 వచనములలో స్తుతిగీతము చెప్పబడియున్నది.

1. నిత్యము ఆరాధన జరుగుచు యుండును. 8-9 వచనములలో స్తుతిగీతము చెప్పబడియున్నది.

1. యెషయా 6:1-3లో వలె దేవుని పరిశుద్ధతనువారు కొనియాడు చుందురు.

2. ఆయన నిత్యుడు అని వారు స్తుతించుచుందురు.

B. ఆరు 24 గురు పెద్దలు సృష్టిగీతము పాడుచు దేవుని స్తుతించుదురు.

1. వారు సాగిలపడి ఆయనను ఆరాధిస్తారు

2. విధేయత చూపుచు తమ కిరీటములను ఆయన సింహాసనము ఎదుట వేస్తారు.

3. నీవే ఘనత మహిమలు పొందనర్హుడవని చెప్పుదురు.

4. ఏలయనగా ఆయనను బట్టియే సమస్తమును సృష్టింపబడెను. సర్వమును ఆయన ద్వారా సృష్టింపబడెను (కొలస్స 1:16).

**ముగింపు:** దేవుడు పరలోకమందుండి పాలించుచున్నారు. దేవుని సంహాసనము వర్ణనాతీతము, మనోహరము, మనం గ్రహించుకోలే నంత ఆశ్చర్యకరమైనది. ఆయనను ఆరాధించుట అతిప్రాముఖ్యము. ఇప్పుడాయనను ఆరాధించుటలో ఆనందం పొందకపోతే, పరలోకానందాన్ని అనుభవించలేవు. దేవుడు పాత క్రొత్త నిబంధన కాలములలో విమోచింపబడిన వారిచేత ఆరాధింపబడు దేవుడు. పరమందలి దూతలును సర్వసృష్టియు ఆయననారాధింప బాధ్యులు!

**- జాన్‌స్టేనీ**

## ఇష్మాయేలు, అనగా దేవుడు వినును
## (Ishmael, that is God heareth)

"క్రీస్తు మన ప్రతి సంభాషణను వినును" అను ఈ మాటలను ప్రతి క్రైస్తవ గృహములోను చదువుతాము. దేవుడు ఈ విశ్వానికి సృష్టికర్త. ఆయనకు తెలియకుండా యేదీ ఈ విశ్వంలో జరుగదు. మన తలవెంట్రుకల సంఖ్య నెరిగిన వానికి మనలను గూర్చి సమస్తము ఎరుకే. ఆయన సర్వాంతర్యామి. ఆయన మన ప్రతి సంభాషణను, ప్రతి ప్రార్ధనను ఆలకించును.

హేబెలు రక్తము నేలలోనుండి మొర్రపెట్టగా దేవుడు వినెను. అతనిని హత్య చేసిన తన అన్నయైన కయీనును ఆయన శిక్షించెను (ఆది.కా. 4:1-5). తన యజమానురాలైన శారాయినుండి పారిపోవుచున్న దాసియగు హాగరు ప్రార్ధనను దేవుడాలకించెను (ఆది.కా. 16:11). సొదొమగొమొర్రాల దుష్టత్వము ఆయన సన్నిధిని వినబడగా దేవుడు వాటిని అగ్ని గంధకములతో నాశనము చేసెను (ఆది.కా. 18:20,24). బానిసలై యుండిన ఇశ్రాయేలీయుల మొరను ఆయన వినెను (నిర్గ 3:9). మోషే నాయకత్వములో ఆయన వారిని ఎట్లు విడిపించెనో పరిశుద్ధలేఖనములు ఉపదేశించు చున్నవి. దేవుడు హన్నా యొక్క ప్రార్ధన విని ఆమెకొక కుమారునను గ్రహించెను. ఆమె అతనికి సమూయేలు అని పేరు పెట్టెను. ప్రవక్తయైన యోనా దేవుని సన్నిధి నుండి పారిపోవుచు ఒక పెద్ద చేప కడుపులో యుండి ప్రార్ధన చేయగా దేవుడతని ప్రార్ధనవిని, అతని కక్కి వేయునట్లు ఆయన ఆ చేపకు ఆజాపించెను.

గబ్రియేలు దూత జెకర్యాను చూచి, "జెకర్యాభయపడకుము, నీ ప్రార్ధన వినబడినది. నీ భార్యయైన ఎలీసబెతు నీకుకుమారుని కనును, అతనికి యోహానని పేరు పెట్టుదువు" అని చెప్పెను (లూకా 1:13). కొర్నేలి యొక్క ప్రార్ధనలు దేవునికి వినబడెను. అతడును

అతని యింటివారును రక్షణ సువార్తను వినునట్లు ఆయన పేతురును అతని యింటికి పంపించెను (అపో.కా.10). ఆయనను ఆసక్తితో వెదకు వారి ప్రార్ధనలను ఆయన వినును. అన్యాయస్థుడైన తీర్పరి ఒక విధవరాలి విన్నపము నాలకించగా తాను ఏర్పరచుకొనిన వారు మొర్రపెట్టుకొను చుండగా దేవుడు వారికి న్యాయము తీర్చును గదా? (లూకా 18:7).

ఐగుప్తునుండి కానానుకు వెళ్లుచు ప్రయాణములో ఇశ్రాయేలీయులు దేవునిపై పలుమారులు సణిగారు. "యెహోవా దానిని వినినప్పుడు ఆయన కోపము రగులు కొనెను" (సంఖ్యా 11:1). మనం యితరులను గూర్చి, ముఖ్యముగా ఆయన దాసులను గూర్చి సణిగినప్పుడు దేవుడు వినును. దైవజనుడైన మోషేకు వ్యతిరేకముగా మిరియాము, అహరోనులు సణిగినప్పుడు దేవుడు వారిని శిక్షించెను. "నా సేవకుడైన మోషేకు విరోధముగా మాటలాడుటకు మీరేల భయపడలేదని" దేవుడు వారినడిగెను (సంఖ్యా 12:1-9). కుష్ఠరోగము గలదిగా దేవుడు మిర్యామును మొత్తెను. మోషే ప్రార్ధన చేయగా ఏడు దినములు అనంతరము ఆమె శుద్ధి ఆయెను.

మన హృదయములోని ప్రతి దుష్ట తలంపును దేవుడు వినును. నోవహు కాలమందలి దుష్టజనాంగము నంతటిని ఆయన నాశనము చేసెను. "నరుల హృదయము యొక్క తలంపుల లోని ఊహ అంతయు ఎల్లప్పుడు చెడ్డదని యెహోవా చూచెను" (ఆది.కా.6:5). బుద్ధిహీనుడైన ధనిక రైతు యొక్క తలంపులను ఆయన వినెను. అతడిట్లు తలంచెను: "నా పంట సమకూర్చు కొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతుననుకొని తనలో తాను ఆలోచించుకొని, నేనీలాగు చేతును; నా కొట్లు విప్పి వాటికంటె గొప్ప వాటిని కట్టించి, అందులోనా ధాన్యమంతటిని, నా ఆస్థిని సమకూర్చుకొని నా ప్రాణముతో, ప్రాణమా అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది; సుఖించుము, తినుము త్రాగుము సంతోషించుమని చెప్పుకొందుననుకొనెను. అయితే దేవుడు వెర్రివాడా, ఈ రాత్రి నీ ప్రాణము

నడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను" (లూకా 12:17-20). ఇశ్రాయేలీయుల మధురగాయకుడగు దావీదు, "నానోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగును గాక" యని ప్రార్థించాడు (కీర్త 19:14).

మనము పలుకు ప్రతి మాటను గూర్చి దేవుడు మనలను లెక్క అడుగును. "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పునొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు" అని యేసు ప్రభువు చెప్పెను (మత్తయి 12:36-37). మన నాలుకను గూర్చి జాగ్రత్తగ యుండాలని యాకోబు 3:1-12లో చెప్పబడి యున్నది. బూతులైనను, పోకిరి మాటలైనను నరసోక్తులైనను ఉచ్చరింపకూడదని ఎఫెసీ 5:4లో పౌలు హెచ్చరించాడు (I తిమోతి 6:20; II తిమో 2:16).

మన పరలోకపు తండ్రి మన ప్రార్థనలనాలకింపకపోతే మన గతి యేమవును? (I పేతురు 3:16). మన జీవితం ఆయన చిత్తానికి విరుద్ధంగా యుంటే ఆయన మనలనాలకించడు (యెషయా 59:1-2). మనము తన ఏకైక కుమారుని మాటలను విని రక్షింపబడునట్లు ఆయనను ఈ లోకమునకు పంపారు. "ఈయనే నా ప్రియ కుమారుడు. ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాటలను వినుడి" యని ఆయన ఉద్ఘాటించారు (మత్తయి 17:5). ఆయన మాటలను విననివాడు నిత్యనాశనమునకు గురి యవుతాడు.

మనము తన కుమారుని మాట వినిన యెడల మన పరలోకపు తండ్రి మన ప్రార్థనలను వినును, "చెవులను కలుగజేసినవాడు వినకుండునా?" (కీర్త 94:6):

**- కవితా గూటం**

## మనరాజు వచ్చుచున్నాడు

(Our King is Coming)

యేసు క్రైస్తవుని రాజు. ఆయన రాజులకు రాజుగా ప్రభువులకు ప్రభువుగా పాలించుచున్నాడు, రాజ్యమేలు చున్నాడు (ప్రక 17:4; 19:16). ఆయన అన్ని విషయముల లోను సంఘమునకు శిరస్సై యున్నాడు. ఆయనే దాని రక్షకుడు. ఆయన దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై నేడును సజీవుడై యున్నాడు. మరల వచ్చు సమయము కొరకు ఆయన కనిపెట్టు చున్నాడు.

మహిమల గల రాజైన యేసు తన దూతలతో కూడ మరల వచ్చును. అది ఎంత ఘనమైన శక్తివంతమైన దృశ్యమో. ఈ లోక జనాంగము లన్నియు ఆయన మహిమను చూచును; ఆయనను పొడిచిన వారును చూచెదరు; భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టు కొందురు; ఆమేన్" (ప్రక 1:7).

యేసు ఈ లోకమునకు వచ్చి యెరూషలేములో తన సింహాసనము నేర్పరచి వెయ్యేండ్లు పాలించునని అనేకులు బోధిస్తారు. గాని విచారం యేమంటే ఆ బోధ బైబిలులో కానరాదు. యేసు యొక్క రాజ్యము ఆయన శిష్యుల జీవిత కాలములోనే స్థాపించబడింది (మార్కు 9:11). ఆ రాజ్యము అప్పటికే యున్నట్లును కొందరు దానిలోనికి మార్చబడినట్లును కొలస్సయులకు వ్రాసిన పత్రికలో పౌలు చెప్పాడు (కొల 1:13,14). రాజ్యము స్థాపించబడే యున్నది. క్రీస్తు దానిపై రాజుగా రాజ్యమేలు చున్నాడు.

క్రీస్తుయొక్క రెండవ రాకడను గూర్చి తేదీలు నిర్ణయించడం కొందరికి పరిపాటి. గాని క్రీస్తు మరల ఎప్పుడు వచ్చునో ఎవరికీ తెలియదని లేఖనములు చెప్పుచున్నవి. "ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును" (2 పేతురు 3:10). లోకులు నెమ్మదిగా యున్నది. భయమేమియు లేదను చుండగాను, కొందరు ఆయన రాకడను గూర్చిన వాగ్దాన

మేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్లే నిలిచియున్నదే అని చెప్పుకొనుచుండగా, ప్రభువు ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకమునుండి దిగివచ్చును (I థెస్స 5:32; 2 పేతురు 3:3-4; I థెస్స 4:16). గాని ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు మనకేమియు తెలియదు. గాని ఆయన తప్పక వచ్చును. నేను మరల వత్తునని ఆయనే చెప్పెను (యోహాను 14:3).

యేసు ఈ లోకములో శ్రమలను, హేళనను, దూషణను, అవిశ్వాసమును, సిలువను భరించి, కొరడా దెబ్బలను సహించి ఈ లోకమును విడిచెను. గాని ఆయన మహిమతో, శక్తితో, ఘనతతో తీర్పు తీర్చుటకు వచ్చును.

మనరాజు మరల వచ్చినప్పు డాయన మృతులనందరినీ అల్పులనేమి ఘనులనేమి అందరినీ లేపును (ప్రక 20:12). ఘనతను, ఐశ్వర్యమును, ఈ లోక బలమును పొందిన మానవు లందరు ఆయన యెదుట నిలుతురు. ధనికులు, దరిద్రులు, బానిసలు, స్వతంత్రులు అందరు క్రీస్తుకు లెక్క అప్పగింతురు (2 కొరింథీ 5:10). అక్కడ పక్షతమేమివుండదు; ఆ రాజు వచ్చినప్పుడు ఎవడు తప్పించుకొన జాలడు.

మనుష్యులు దాగుకొనజూతురు. వాళ్లంతా ఒకే రీతిగ సాకులు చెప్పజూడవచ్చును. వారు పాపములో మునిగిపోయి ప్రభువుచే కనుగొనబడి బాధలో ఏడ్వవచ్చును. ఇవేమీ ఆ రాజు యెదుట ఆ రోజు పని చేయవు. ఆయన తీర్పు కనికరము లేనిదైయుండును. ఆ మనుష్యులు భూమిమీద యుండగా ప్రభువు వారికి అవసరమైనంత కనికరం చూపారు.

యేసు మరల వచ్చినప్పుడు ఆయన రాజ్యమును తండ్రికి అప్పగించును (Iకొరి 15:22-28). రాజులకు రాజు అపవాదిని అతని అనుచరులను జయించి యుండును. దేవుని రాజ్య పౌరులు తండ్రిచే నిత్యము ఆశీర్వదించ బడుదురు.

రాజులకు రాజు తిరిగి వచ్చు చున్నాడు. గనుక ప్రతివాడు ఆఘడియ కొరకు సిద్ధపడవలెను. క్రీస్తునందున్న వారు నమ్మకముగా జీవించవలెను

(తీతు 2:11,12). క్రీస్తులో లేని వారు ఆయనకు లోబడి సిద్ధపడి యుండవలెను (మత్త 7:21; మార్కు 16:15,16; హెబ్రీ 5:8-9).

మన రాజు వచ్చుచున్నాడు. నీవాయన రాజ్యములో లేకపోతే ఇప్పుడే ఆయనకు లోబడుము. ఆయన రాజ్యములో నీవుండాలని ఆయన కోరుచున్నాడు.

– చార్ల్స్ కాబ్

## వింత మనుష్యుడు!

- బైబిలు దేవుని వాక్యమని నమ్ముచున్నట్లు అతడునాతో చెప్పాడు, గాని దానిని ఎన్నడు చదువడు.
- సంఘసభ్యులు నిజంగా సమర్పించుకొని పనిచేస్తే సంఘము మరింత బలముగా యుంటాదన్నాడు, గాని అతడాపని చేయడు.
- సంఘ కూటములు స్తుతించడానికి, హెచ్చరిక చేయుడానికి మంచి అవకాశములన్నాడు, గాని ఎన్నడు హాజరవ్వడు.
- యువకులకు మంచి విలువలు ఉపదేశించాలన్నాడు గాని, వాటిని ఎన్నడు పాటించడు.
- ప్రభువు కోరినట్లుగా సంఘము పనిచేయడం లేదన్నాడు, గాని అతడు పనిచేయడు.
- దేవుడు ప్రార్థనలు విని వాటికి జవాబిస్తాడన్నాడు గాని తానెన్నడు ప్రార్థించడు.
- ప్రభువు తిరిగి వచ్చుచున్నట్లు అతనికి తెలుసన్నాడు గాని ప్రభువు ఎన్నడు రాడన్నాట్లే అతడు ప్రవర్తిస్తాడు!

## మనదేవుడు దహించు అగ్నియై యున్నాడు

పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను అని మనకు తెలియజేయబడినది (హెబ్రీ 1:1-2). హెబ్రీ పత్రికలేఖకుడు కుమారుని యొక్క గొప్పతనాన్ని, శ్రేష్టతను వివరించు ఏడు సంగతులను గూర్చి తెలియజేస్తు, ఆయన ద్వారా ఇయ్యబడిన బయల్పాటు యొక్క ప్రాముఖ్యతను వక్కాణించాడు.

మొదటిగా, దేవుడు తన కుమారుని "సమస్తమునకు వారసునిగా నియమించెను". అనగా తండ్రికి కలిగినవన్నియు యేసు కూడ కలిగియుండెనని యర్థము (అపొ.కా.2:36; యోహా 17:10;16:15). తరువాత, "ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను". అనగా కుమారుడైన క్రీస్తు ప్రపంచముల నిర్మాణములో మౌనముగా యుండక సహకరిస్తు చురుకుగా పాల్గొనెనని యర్థము (గలతీ 1:15-17; యోహాను 1:3,10; I కొరింథీ 8:6). మూడవదిగా క్రీస్తు దేవుని "మహిమ యొక్క తేజస్సునై" యున్నాడు. ఆయన తేజోమయుడైన దేవుని మహిమను పరిపూర్ణముగా ప్రత్యక్ష పరచెను (యోహాను 1:18). నాల్గవదిగా ఆయన "దేవుని తత్వము యొక్క మూర్తిమంతమునై యున్నాడు". అందువలననే యేసు నన్ను చూచినవాడు దేవుని చూచియున్నాడని చెప్పెను (యోహా 14:9) తరువాత క్రీస్తు "తన మహత్తు గల మాట చేత సమస్తమును నిర్వహించుచున్నారు". ఆయన తన వాక్కుచేత సమస్తమును నిర్మించి చలింపజేయుచున్నాడు. మరియు "పాపముల విషయమై శుద్ధీకరణము తానే చేసారు". తన ప్రాణమునర్పించారు. తిరిగిలేచారు. గనుక ఆయన "ఉన్నతలోకమందు మహామహుడగు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను". ఆయన హెచ్చింపబడ్డారు, సర్వాధికారము కలిగి యున్నారు (ఎఫెసీ 4:10; ఫిలిప్పీ 2:9; కీర్తన 110; లూకా 22:69; మత్తయి 28:18; యోహా 19:2). క్రొత్తనిబంధన పుటల ద్వారా దేవుడు మనతో ఎవరిద్వారా మాటలాడెనో ఆయన యొక్క పరిస్థితి, తత్వము యిది.

ప్రవక్తల కంటె కుమారుడు శ్రేష్టుడైనందున క్రీస్తు ద్వారా యెహోవా యిచ్చిన బయల్పాటును గూర్చి మనం యేమి నేర్చుకోగలము? సూక్ష్మంగా యిది. "దేవదూతల ద్వారా (సీనాయిలో) పలుకబడిన వాక్యము (గలతీ 3:19; అపొ.కా.17:53) స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండగా, ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము?" (హెబ్రీ 2:2,3). కుమారుని ద్వారా సువార్త ద్వారా అనుగ్రహింపబడిన రక్షణను నిర్లక్ష్యము చేస్తే తప్పించుకొనలేము. దానిని మనం

చులకనగా చూస్తే ధర్మశాస్త్రము విధించిన శిక్షకంటె అత్యధికమైనది మనకు ప్రాప్తించును.

తరువాత హెబ్రీ పత్రిక లేఖకుడు యూదులలోనుండి క్రైస్తవులైనవారు తిరిగి యూదా మతమునకు మరలే ప్రమాదములో యుండగా వారికి యిట్లు హెచ్చరిక చేసాడు: "ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించినయెడల ఇద్దరు ముగ్గరు సాక్షుల మాటమీద కనికరింపకుండ వాని చంపించుదురు. పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును?"

క్రీస్తులో నుండి తొలగిపోతే ఎంత తీవ్రమైనది? మరణ దండన యంత తీవ్రమైనది. "వారు భూమి మీదనుండి బుద్ధి చెప్పిన వానిని నిరాకరించినప్పుడు (ఇశ్రాయేలీయులు అరణ్యములో) తప్పించుకొనకపోయిన యెడల పరలోకము నుండి బుద్ధి చెప్పుచున్నవానిని విసర్జించు మనము తప్పించుకొనకపోవుట మరి నిశ్చయము గదా!" (హెబ్రీ 12:25). తొలగిపోతే మరణమే.

క్రీస్తును చూడాలంటే ప్రేమయే ప్రాముఖ్యము. అవును, భయము కాదు గాని, కృతజ్ఞతయే మనలను నమ్మకస్థులనుగా యుంచవలెను (హెబ్రీ 12:28). అయితే ప్రేమ, కృతజ్ఞతలు మనలో లోపించినప్పుడు "మన దేవుడు దహించు అగ్నియై యున్నాడను" సంగతి మరచిపోరాదు (హెబ్రీ 12:29).

– రెక్స్‌బేంక్స్

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004